క్లుప్తంగా

నేడు శివుడికి రుద్రాభిషేకం

రామగిరి (నల్లగొండ) : పట్టణంలోని తులసీనగర్ భక్తాంజనేయ స్వామి ఆలయంలో గల శివాలయంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా పరమేశ్వరుడికి బుధవారం ఉదయం రుద్రాభిషేకాలు చేపట్టనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి కుశలయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. రుద్రాభిషేకం అనంతరం స్వామివారికి అన్నాభిషేకం ఉంటుందన్నారు.

బీసీ రెసిడెన్షియల్ భవనానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీదేవి

నల్లగొండ రూరల్ : మండలంలోని అప్పాజీపేటలో బీసీ రెసిడెన్షియల్ స్కూల్ భవనాన్ని నిర్మించేందుకు ఇన్‌చార్జ్ ఆర్డీఓ శ్రీదేవి మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలోని స ర్వే నంబర్ 123లో ఎంత స్థలం అవసరం ఉంటుందో గుర్తించి సర్వే రిపోర్టు తయారు చేయాలని ఆమె తహసీల్దార్ శ్రీనివాస్‌ను ఆదేశించారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి



పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న పశువైద్యులు

మర్రిగూడ : రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారులు సురేందర్, యమున అన్నారు. మంగళవారం మండలంలోని యరగండ్లపల్లిలో 179 పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది మల్లేష్, గోపాలమిత్రలు నరేష్, సుధాకర్, శివ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటా



కార్మికులతో మాట్లాడుతున్న దైద రవీందర్

నకిరేకల్ : పేదల ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, ప్రజా సేవకే నాజీవితం అంకితమని టీపీసీసీ నాయకుడు దైద రవీందర్ అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్మికులకు ఆయన ఆర్‌అండ్‌బీ బంగ్లా ఆవరణలో కలిసి తేనేటి విందు ఇచ్చారు. అనంతరం కార్మికులతో మాట్లాడారు. తాను దళిత బిడ్డగా దళితవాడలో పుట్టి పెరిగానని అన్నారు. ఆ దేవుడి దయతో మీఅందరి ఆశీస్సులతో మీకు చేదోడు వాదోడుగా ఉంటానన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సైదులు

మునుగోడు : మునుగోడు మండలానికి అధిక నిధులు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను కలిసి సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. అదే విధంగా మునుగోడుకు బి వెల్లాంల నుంచి సాగునీరు అందేలాచూడాలని కోరారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

శాలిగౌరారం : విద్యుదాఘాతంతో ఓ ఎద్దు మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని భైరవునిబండ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు పులిగిళ్ల కాశయ్య ఎద్దు తన పొలంలో మేతమేసుకుంటూ వెళ్లి అక్కడ తెగిపడి ఉన్న విద్యుత్ తీగను తగిలింది. దీంతో ఎద్దు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఎద్దు విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు.

పీఎంకు ఈ మెయిల్ ద్వారా లేఖ

మిర్యాలగూడ టౌన్ : బీసీల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని కోరుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఈ మెయిల్ ద్వారా మంగళవారం లేఖ పంపించినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి లింగంగౌడ్ తెలిపారు. బీజేపీ ప్రభుత్వం తీసుకవచ్చిన ఈ డబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో బీసీలకు అన్యాయం జరుగుతుందని లేఖలో పేర్కొన్నారు.

అరకొర వసతులతో అవస్థలు

- వడ్డెరకాలనీలో కానరాని రోడ్లు, డ్రెయినేజీలు
- ఏళ్లుగా గుడిసెల్లోనే నివాసం
- పక్కా ఇళ్ల కోసం ఎదురుచూపులు



గుడిసెల్లో జీవనం సాగిస్తున్న వడ్డెర కాలనీవాసులు

నకిరేకల్ : మున్సిపాలిటీలో పరిధిలోని 1వవార్డు మార్కెట్‌రోడ్డులో ఉన్న వడ్డెరకాలనీలో ప్రజల పరిస్థితి దుర్భరంగా ఉంది. అరకొర వసతులతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో సరైన రహదారులు, డ్రెయినేజీలు లేక పోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. వర్షం వస్తే ఉన్న చిన్నపాటి రోడ్డు చిత్తడిగా మారుతున్నాయి. కాలనీలోకి వెళ్లాలన్నా బయటకు రావాలన్నా నరకమే కనిపిస్తుంది. ఈ కాలనీలో సుమారు 50కుటుంబాలపైనే నివాసం ఉంటున్నారు. ఈ కాలనీలో మొత్తం 150మంది జనాభా ఉంటారు. వారందరూ మూడు దశాబ్దాల నుంచి గుడిసెల్లోనే జీవనం సాగిస్తూ బతుకు జీవుడా అంటూ కాలం వెల్లదీస్తున్నారు. వారిలో కొంత మందికి ఇంటి స్థలాలు లేకపోవడంతో ఇతరుల భూముల లోనే గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. వర్షాకాలంలో గుడిసెల్లోకి వర్షం నీరుతో పాటు విష సర్పాలు కూడా వస్తున్నాయని వాపోతున్నారు. ఈ కాలనీల్లో డ్రెయినేజీలు, సీసీరోడ్లు నిర్మాణాలు లేక మురుగునీటితో ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా కాలనీలో కనీసం విద్యుత్ సౌకర్యాలు తీసుకునే పరిస్థితిలో లేకుండా జీవనం నెట్టుకొస్తున్నారు. ఇప్పటికైనా మా కుటుంబాలకు ప్రభుత్వం గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని, అదే విధంగా కాలనీలో సీసీరోడ్లు, డ్రెయినేజీలు ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం



వడ్డెరకాలనీలో సీసీరోడ్లు, డ్రెయినేజీలు లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాటి నిర్మాణం కోసం అధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఎమ్మెల్యే సహకారంతో నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం. ఈ కాలనీలో అందరు కూలీ చేసుకుని జీవనం సాగిస్తారు. ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో తగిన ప్రాధాన్యం ఇచ్చేలా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా.

– కందాల భిక్షంరెడ్డి, 1వవార్డు కౌన్సిలర్

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కట్టంగూర్ : పరడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

- ఎమ్మెల్యే వేముల వీరేశం

కట్టంగూర్ : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మంగళవారం మండలంలోని పరడ, నారెగూడెం, ఈదులూరు, మునుకుంట్ల, కల్మెర, ముత్యాలమ్మ గూడెం, ఎరసానిగూడెం, బొల్లేపల్లి గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం ఏగ్రేడుకు రూ.2320, సాధారణ రకానికి రూ.2300 మద్దతు ధర నిర్ణయించిందని తెలిపారు. కేంద్రాల్లో రైతులకు సరైన మౌలిక వసతులు కల్పించాలని సంఘ బంధం సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు, మాజీ జెడ్పీటీసీలు సుంకరబోయిన నర్సింహ, మాద యాదగిరి, మాజీ ఎంపీపీ కొండ లింగస్వామి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, పెద్ది యాదగిరి, రెడ్డిపల్లి సాగర్, పుట్ట నర్సింహారెడ్డి, వల్లపు శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఎం సైదులు, ఐతగోని నారాయణ, కురిమిల్ల మల్లేష్, చింత వెంకటనర్సయ్య, గడుసు సుధీర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుంకరబోయిన వెంకన్న, ఎం.శ్రీను, మిర్యాల యాదగిరి, సీసీ శంకర్, వెంకన్న పాల్గొన్నారు.



మునుగోడు : కొంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మునుగోడు : మండలంలోని కొంపల్లి గ్రామంలో రైతు సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆ గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ జాల వెంకన్న మాట్లాడుతూ.. రైతులు ధాన్యాని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి ప్రభుత్వం అందించే మద్దత ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ యాదగిరి, సీఈఓ లక్ష్మణ్, కొంపల్లి, వెల్మకన్నె గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మూసీ పునరుజ్జీవంతో ప్రజలకు ఎంతో మేలు

- ఎమ్మెల్యే మందుల సామేల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం : మూసీ మురుగుతో రాష్ట్రంలోని హైదరాబాద్, రంగారెడ్డి, యాదాద్రిభువనగిరి, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల ప్రజలు జీవనాన్ని కోల్పోయి అష్టకష్టాలు పడుతున్నారని మూసీ పునరుజ్జీవంతో ఆయా జిల్లాల ప్రజలతో పాటూ భవిష్యత్ తరాలకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని మేడిపల్లిలో జరిగిన మూసీ పునరుజ్జీవ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాడు భాగ్యనగరంతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మూసీనది పరివాహక గ్రామాలకు తాగునీటిని అందించిన మూసీనది, నేడు పంటలకు కూడా వినియోగించలేని దుస్థితికి చేరుకుందన్నారు. మూసీనదిని ప్రక్షాళన చేపట్టి ఆధునీకరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మూసీనది పునరుజ్జీవం కార్యక్రమంలో భాగంగా ఈనెల 27న శాలిగౌరారం మండలం గురుజాల, అడ్డగూడూరు మండలం మానాయికుంట గ్రామాల మధ్య మూసీనదిపై ఉన్న బ్రిడ్జిపై జరిగే ప్రజా సన్నాహక కార్యక్రమానికి నియోజకవర్గ ప్రజలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై విచారణ చేపట్టాలి

నల్లగొండ : సాధారణ బదిలీల్లో జూన్ -2024లో చాలా మంది ఉపాధ్యాయులు అక్రమంగా స్పౌజ్ వాడుకుని బదిలీ అయ్యారని వారిపై విచారణ జరపాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎండీ.ఖుర్షిద్ మియా, ప్రధాన కార్యదర్శి పి.వెంకులు మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఆరుగురు ఉపాధ్యాయులు అక్రమంగా స్పౌజ్ వాడుకుని దు ర్వినియోగం చేశారని అన్నారు. వారిని డీఈఓ సస్పెండ్ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ముమ్ముందు బదిలీల విషయంలో ఉపాధ్యాయులు స్పౌజ్‌ను దుర్వినియోగం చేయకుండా చూడాలన్నారు.

కార్మికుల వేతనాలు పెంచాలని కమిషనర్‌కు వినతి



మున్సిపల్ కమిషనర్ వీరేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

చిట్యాల : మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులతో పాటు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు నెలకు రూ.26వేల వేతనం అందజేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది, కార్మికులు, కమిషనర్ వీరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్మికులుగా పనిచేస్తున్న వారిలో వృత్తి నైపుణ్యాలను, చదువుల ఆధారంగా ప్రమోషన్‌లు కల్పించాలన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కారించాలని కోరుతూ ఈనెల 25న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు జడల నర్సింహ, పాల లక్ష్మయ్య, బాకి అండాలు, పాల యమున, వరలక్ష్మి, నర్సింహ, కిషన్, నరేష్, దుర్గేష్, శంకర్, అలివేలు, లక్ష్మి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

నకిరేకల్ : ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చిందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యానాల శంకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని నోముల గ్రామంలో నిర్వహించిన పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో రైతు రుణమాఫీ పూర్తిస్థాయిలో జరగలేదని, అదే విధంగా రైతు భరోసా ఊసే లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై వ్యతిరేకతతో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కానుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు యానాల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బుడిగే సైదులు, నాయకులు ఉప్పల నాగరాజు, రాచకొండ పెద్దులు, బాదిని యాదయ్య, భూపతి నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొమురం భీమ్‌కు ఘన నివాళి



కొమురం భీమ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈఓ బిట్టు శ్రీను

మర్రిగూడ : మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రంలో ట్రైబల్ టీచర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆదివాసీ హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన కొమురం భీమ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ బిట్టు శ్రీను ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. జల్, జమీన్, జంగల్ అనే నినాదంతో ఆదివాసీల హక్కులకై ఆనాటి నిజాం ప్రభుత్వంతో పోరాటం చేసిన గొప్పవీరుడు కొమురం భీమ్ అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ పర్యవేక్షకుడు యాకుబ్‌అలీ, ట్రైబల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉదావత్ లచ్చిరామ్‌నాయక్, సబావత్ వెంకట్‌కుమార్, కేతావత్ శ్రీరాంనాయక్, రమావత్ విఠల్‌నాయక్, రమావత్ రమేబాబు, నేనావత్ రమేష్‌నాయక్, తిరుపతయ్య, దుర్గా, సైదులు, రహీం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి



నాంపల్లి : మాట్లాడుతున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

నాంపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మేళ్లవాయి గ్రామంలో కొమ్ము లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన గ్రామ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ప్రభుత్వం మెడలువంచైనా హామీల అమలుకు కృషి చేస్తామన్నారు. ప్రతి నియోజకవర్గానికి కనీసం 5వేల ఇళ్లను మంజూరు చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి, గ్రామ కార్యదర్శి కొమ్ము లక్ష్మయ్య, వాసిపాక ముత్తిలింగం, ముఖేష్, పర్వతాలు, అందుగుల రాములు, గడ్డం ఏల్లేష్, పగిళ్ల యాదయ్య, రామలింగం, సైదమ్మ, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.



కేతేపల్లి : మాట్లాడుతున్న కందాల ప్రమీల

రైతులందరికీ రుణమాఫీ అమలు చేయాలి

కేతేపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రైతులకు రుణమాఫీ వందశాతం అమలు చేశామని సీఎం, మంత్రులు చెబుతున్నా ఇప్పటికీ క్షేత్రస్థాయిలో 50శాతం కూడా అమలు కాలేదన్నారు. రుణమాఫీ అమలు చేయడంతో పాటు వానాకాలం పంటకు సంబంధించిన రైతు భరోసా నిధులను విడుదల చేయాలన్నారు. దొడ్డురకం ధాన్యానికి బోనస్ చెల్లించాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు, మండల కార్యదర్శి సీహెచ్.లూర్దు మారయ్య, నాయకులు కోట లింగయ్య, వంగూరి వెంకన్న, పెరిక మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

22 సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు : సబ్ కలెక్టర్

మిర్యాలగూడ: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం 22 సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం పొడవైన పత్తి పింజ రకానికి క్వింటాల్‌కు రూ.7,521, మధ్యస్థ పింజ రకానికి రూ.7,121 మద్దతు ధర అందిస్తుందని పేర్కొన్నారు. పత్తి రైతులు దళారులను నమ్మి మోసపోకుండా సీసీఐ కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. డివిజన్ పరిధిలోని పత్తి రైతులు సీసీఐ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మహా సమ్మేళనం కరపత్రాల విడుదల



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

నకిరేకల్ : ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో వచ్చే నెల 3వతేదీన హైదరాబాద్‌లో జరగబోయే కార్యకర్తల మహా సమ్మేళనం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ యాతాకుల వెంకన్న కోరారు. మంగళవారం పట్టణంలో సమ్మేళనానికి సంబంధించిన ప్రచార కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. దేశం, రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ప్రజల జీవితాలను అంధకారంలోకి నెట్టి ప్రజా సేవ చేయాల్సిన నాయకులు వారి సేవలకే పరిమితమై ఉంటున్నారని ఆరోపించారు. అణగారిన పేద వర్గాల ప్రజల కోసం ఏర్పడిన ధర్మ సమాజ్ పార్టీ మహా సమ్మేళనంలో కార్యకర్తలు, ప్రజలు అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, సాయి, సైదులు, వెంకన్న, జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కర్నాటి మల్లేశం

చండూరు(గట్టుప్పల్) : గట్టుప్పల్ మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో గట్టుప్పల్ మండల పార్టీ కార్యదర్శి కర్నాటి మల్లేశం పాల్గొని మాట్లాడారు. మండల కేంద్రంలో ఈనెల 24న నిర్వహించే పార్టీ మండల ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహాసభకు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి అయిలయ్య పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో పార్టీ గట్టుప్పల్ టౌన్ కార్యదర్శులు కర్నాటి సుధాకర్, కర్నాటి వెంకటేశం, మండల కమిటీ సభ్యులు కక్కునూరు నగేష్, నాయకులు బుచ్చిరెడ్డి, ఖమ్మం చిన్నయాదయ్య, నల్లవెల్లి భిక్షం, బుచ్చిరెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులు

రామగిరి (నల్లగొండ) : పట్టణంలోని ఏకలవ్య పాఠశాల విద్యార్థులు రామానుజన్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో ప్రతిభ కనబరిచారు. రామానుజన్ మేథమెటిక్స్ అకాడమి ఆధ్వర్యంలో రామచంద్రపురం వారు నిర్వహించిన రామానుజన్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో పాఠశాలకు చెందిన 38మంది విద్యార్థులు ప్రతిభ చూపి ఫస్ట్ లెవెల్‌కు ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ అలుగుబెల్లి కరుణాకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ వాణి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులను స్థానికంగా మ్యాథ్స్ డైరెక్టర్ మారం శ్రీనివాస్‌రెడ్డితో చైర్మన్, ప్రిన్సిపాల్ అభినందించారు.

కుమారుడికి తలకొరివి పెట్టిన తల్లి



తలకొరివి పెడుతున్న రాములమ్మ

మిర్యాలగూడ టౌన్ : కుమారుడికి తల్లి తలకొరివి పెట్టిన ఘటన మంగళవారం మిర్యాలగూడ పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని బంగారుగడ్డకు చెందిన రేణికుంట్ల విజయ్(45) స్థానికంగా కుట్టుమిషన్ దుకాణంలో పనిచేస్తూ తల్లిని సాకుతున్నాడు. సోమవారం రాత్రి విజయ్ గుండెపోటుతో మృతిచెందాడు. ఇతడికి వివాహం కాకపోవడంతో తల్లి రేణికుంట్ల రాములమ్మ 85 ఏళ్ల వయసులో కుమారుడికి తలకొరివి పెట్టడం పలువురిని కలచివేసింది. అవసాన దశలో ఒంటరిని చేసి వెళ్లిపోయావా కొడుకా అంటూ ఆమె రోదించిన తీరు పలువురిని కంటతడిపెట్టించింది.

పాలకవర్గ నియామకంలో జాప్యం

- 6 'ఏ' కేటగిరిలో వెలిమినేడు ఆంజనేయస్వామి ఆలయం
- ఆరేళ్లుగా కుంటుపడుతున్న అభివృద్ధి
- నూతన కమిటీ ఏర్పాటుపై దృష్టి సారించని ఉన్నతాధికారులు



వెలిమినేడు శ్రీఆంజనేయస్వామి ఆలయం

చిట్యాల : జాతీయ రహదారికి అనుకొని ఉన్న ఆ ఆలయంలో నిత్యం వందలాది మంది భక్తులు, వీఐపీలు, వాహనదారులు పూజలు చేసి తమ గమ్యస్థానాలకు క్షేమంగా చేరాలని మొక్కుంటారు. ఈ ఆలయంలో సామాన్య భక్తుల నుంచి కేంద్ర మంత్రుల వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. అలాంటి ఆలయానికి ఆరేళ్లుగా పాలకవర్గం నియామకం లేక ఆలయ అభివృద్ధి కుంటుపడుతుంది. అదే మండలంలోని వెలిమినేడు గ్రామపరిధిలో గల శ్రీఆంజనేయస్వామి ఆలయం.

మూడు సార్లు పాలకవర్గానికి నోటిఫికేషన్లు..

వెలిమినేడు గ్రామ పరిధిలోని జాతీయ రహదారికి అనుకొని ఉన్న శ్రీఆంజనేయ స్వామి ఆలయానికి ఆరేళ్లుగా (2018 నుంచి మధ్యలో 2023లో శాసన సభ ఎన్నికలకు నెల రోజుల ముందు పాలకవర్గం ఏర్పాటు చేసినప్పటికీ రాష్ట్రంలో అధికారం మారడంలో అనంతరం పదవీకాలం రద్దయ్యింది) అధికారులు పాలకవర్గం నియామకం చేపట్టలేదు. ఇప్పటి వరకు ఆలయ పాలకవర్గ నియామకానికి మూడు సార్లు దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు నోటిఫికేషన్లు విడుదల చేశారు. దీంతో అర్హత కలిగిన పలువురు డైరెక్టర్ల స్థానాలకు దరఖాస్తు చేసుకున్నారు. అయినా నేటివరకు నూతన కమిటీ నియామకం కాలేదు. తాజాగా నెలన్నర క్రితం ఆలయ అధికారులు మళ్లీ నోటిఫికేషన్ విడుదల చేశారు. నోటిఫికేషన్ విడుదల చేసిన 20రోజులలోపు పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కాని నేటి వరకు నూతన పాలకవర్గం ఏర్పాటు కాలేదు. దీంతో అధికారుల ఆధ్వర్యంలోనే ఆలయ కార్యక్రమాలు జరుగుతున్నాయి. దీంతో తగిన పర్యవేక్షణ లేక ఆలయ అభివృద్ధి కుంటుపడుతుందని పలువురు భక్తులు, గ్రామస్తులు వాపోతున్నారు.

6 'ఏ' కేటగిరిలో ఉన్నా..

వెలిమినేడు గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయ వార్షిక ఆదాయం సుమారుగా రూ.60లక్షల నుంచి రూ.కోటి వరకు కలిగి ఉంటుంది. దీంతో ఈ ఆలయాన్ని గత ఐదేళ్ల క్రితం ప్రభుత్వం 6 ×ఏ౫ఆలయాల కేటగిరిలో చేర్చింది. ఈ మెరకు ఆలయం అభివృద్ధి చెందుతుందని అందరూ భావించారు, కాని నేటి వరకు ఎలాంటి ప్రత్యేకమైన అభివృద్ధి పనులు జరగకపోవడంతో పాటు పాలకవర్గ నియామకాలు సయితం జరగలేదు. ప్రస్తుతం ఈ ఆలయంలో ఓ పూజరితో ఒక ఈఓ, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్‌లు, ఇద్దరు వాచ్‌మెన్, ఇద్దరు స్వీపర్ పోస్టు సిబ్బంది మాత్రమే ఉన్నారు. ప్రస్తుత అవసరాలతో పాటు 6 'ఏ'కేటగిరిలో ఉన్న ఈ ఆలయానికి అదనంగా మరికొందరు ఉద్యోగులను నియమించాల్సి ఉన్నా భర్తీ చేయడంలేదు. దీంతో ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులపైనే అధిక భారం పడుతుంది. వెంటనే సంబంధిత శాఖ అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు స్పందించి ఆలయానికి పాలకవర్గ నియామకాలు చేపట్టాలని పలువురు భక్తులు, వెలిమినేడు గ్రామస్తులు కోరుతున్నారు. కాగా ఆలయ పాలకవర్గ నియామకం, అభివృద్ధి పనుల లోపంపై వివరణ కోరేందుకు ఆలయ ఈఓ నవీన్‌కుమార్‌ను సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

అభివృద్ధిపై దృష్టి సారించాలి



ఆంజనేయ స్వామి ఆలయం అభివృద్ధిని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. దీంతో ఆలయంలో సరైన మౌలిక వసతులు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ఆలయానికి పాలకవర్గం నియామకంతో పాటు ఆలయ అభివృద్ధి పనులపై దృష్టి వహించాలి. ఆలయంలో నవగ్రహాల మంటపంతో ఏర్పాటుతో పాటు, ఉద్యోగులను నియమించాలి.

– అనుమోజు రామాచారి, యువ సంఘర్షణ సమితి అధ్యక్షుడు, వెలిమినేడు